వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 308 సోమవారం | 24 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

# ఢిల్లీలో సీఎంను కలిసిన కావ్య

## శుభాకాంక్షలు తెలిపిన రేవంత్, దీపాదాస్ మున్షి



లోక్ సభ సమావేశాల నేపథ్యంగా ఢిల్లీకి చేరుకున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యతోపాటు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారల ఇంచార్జి దీపాదాస్ మున్షితోపాటు వివిధ పనుల్లో భాగంగా దేశ రాజధానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా వరంగల్ ఎంపీగా అఖండ విజయం సాధించి మొదటి సారి పార్లమెంట్ సమావేశాలకు హాజరవుతూ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్న డాక్టర్ కడియం కావ్యకు సీఎం రేవంత్ రెడ్డి, ఇంచార్జి దీపాదాస్ మున్షి శుభాకాంక్షలు తెలిపారు.

- వరంగల్ వాయిస్, వరంగల్



8లో..

# ముగ్గురూ.. ముగ్గురే..

టీయూడబ్ల్యూజే(ఐజేయూ)లో మనోళ్లు

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాడిపెల్లి మధు, కార్యవర్గ సభ్యులుగా వేణు మాధవ్, కంకణాల సంతోష్

సన్మానించిన పలువురు జిల్లా నేతలు



# ట్రిప్పింగ్స్, బ్రేక్‌డౌన్‌లకు ఇక చెక్




మానవ రహిత విద్యుత్ సబ్ స్టేషన్లే లక్ష్యంగా అడుగులు

అమలులోకి రియల్ టైం మానిటరింగ్, కంట్రోలింగ్ టెక్నాలజీ

అధ్యయనం చేసిన అధికారులు

పైలట్ ప్రాజెక్ట్ గా చిన్న పెండ్యాల, నిడిగొండ ఎంపిక

విద్యుత్ సరఫరాలో మాటిమాటికి జరుగుతున్న ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్ లకు ఇక చెక్ పడనుంది. కొత్త టెక్నాలజీ అందిపుచ్చుకొని వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అడుగులు పడుతున్నాయి. రానున్న రోజుల్లో మానవ రహిత విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇందుకుగాను నూతన టెక్నాలజీని వినియోగించుకునేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికిగాను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన ఒక కమిటీ రెండు రోజులపాటు ఒడిశా రాష్ట్రంలో పర్యటించి వారు అమలు చేస్తున్న కొత్త టెక్నాలజీపై అధ్యయనం చేశారు. నూతన టెక్నాలజీని అమలు చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ గా చిన్న పెండ్యాల, నిడిగొండ సబ్ స్టేషన్లను ఎంపిక చేశారు. ఇక్కడ సక్సెస్ అయితే రాష్ట్ర వ్యాప్తంగా దీనిని అమలు చేసేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది.

- వరంగల్ వాయిస్, హనుమకొండ

వివరాలు 2లో..





2లో..

# సమస్యలు వింటూ.. పరిష్కారమార్గం చూపుతూ..

గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన దరఖాస్తులు

# ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్‌లకు.. ఇక చెక్





- మానవ రహిత విద్యుత్ సబ్ స్టేషన్లే లక్ష్యంగా అడుగులు
- అమలులోకి రియల్ టైం మానిటరింగ్, కంట్రోలింగ్ టెక్నాలజీ
- అధ్యయనం చేసిన అధికారులు
- పైలట్ ప్రాజెక్ట్ గా చిన్న పెండ్యాల, నిడిగొండ ఎంపిక

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్ లకు చెక్ పెట్టేందుకు నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ తెలంగాణ లిమిటెడ్ కొత్త టెక్నాలజీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని 33/11 కేవీ సబ్-స్టేషన్లు, 33,11 కేవీ ఫీడర్లును రియల్ టైం మానిటరింగ్, కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కొత్త టెక్నాలజీతో సబ్-స్టేషన్లలో లోడ్, పవర్ ఫాక్టర్, ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్, ఎల్ సీలు జరిగిన వెంటనే సమాచారం తెలుసుకోవచ్చు.

## పైలట్ ప్రాజెక్ట్‌గా..

స్కోప్, స్నీడర్ కంపెనీల ఆధ్వర్యంలో అమలు చేయనున్న ఈ కొత్త టెక్నాలజీకి పైలట్ ప్రాజెక్ట్ కింద చిన్న పెండ్యాల, నిడిగొండ సబ్ స్టేషన్లను ఎంపిక చేశారు. ఈ రెండు సబ్ స్టేషన్లలో చేపట్టాల్సిన వివిధ పనులను జులై 5లోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వీరు ఇచ్చే సమాచారానికి అనుగుణంగా టెండర్లను పిలిచేందుకు టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. ఈ రెండు సబ్ స్టేషన్ల పనితీరునుబట్టి టీజీ ఎన్పీడీసీఎల్ రాష్ట్రంలోని మొత్తం సబ్ స్టేషన్లలో టెక్నాలజీ అమలు చేయనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది.

## మానవ రహిత సబ్ స్టేషన్లు..

కొత్త టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా ఫ్యూచర్ లో మానవరహిత సబ్ స్టేషన్లుగా మార్చవచ్చు. తద్వారా ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చని యాజమాన్యం భావిస్తోంది. ఈ కొత్త విధానాన్ని అధ్యయనం చేసేందుకు టెక్నికల్ టీమ్ ను కూడా నియమించింది. ఈ టెక్నికల్ టీంలో ఇంచార్జి డైరెక్టర్ వి.మోహన్ రావు, జీఎం/ఐటి జి.శ్రీనివాస్, జీఎం/ఆపరేషన్ కె.గౌతంరెడ్డి, డీఈ /ఐటి కె. అనిల్ కుమార్, ఏడీఈ/స్కాడా శ్రీకాంత్ సభ్యులుగా ఉన్నారు. వీరు ఈ నెల 11,12 తేదీల్లో ఒడిశా రాష్ట్రంలోని టాటా పవర్ వెస్ట్రన్ ఒడిశా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అధ్యయనం నిర్వహించారు. వారు అనుసరిస్తున్న విధి విధానాలు, పవర్ సప్లైపై పూర్తి స్థాయి అధ్యయనం చేశారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరా..

నూతన టెక్నాలజీని అమలులోకి తేవడం ద్వారా సమస్యలపై త్వరిత గతిన స్పందించడం ద్వారా అంతరాయాల సమయాన్ని తగ్గించడం, తద్వారా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయవచ్చని భావిస్తున్నారు. కనిష్ట అంతరాయ సమయం..మెరుగైన సరఫరా, పర్యవేక్షణ తద్వారా విద్యుత్ పరికరాల జీవితకాలం పెరుగుతుందని కమిటీ అధ్యయనంలో తేలింది. అదే విధంగా సబ్ స్టేషన్ ఆటోమేషన్ టెక్నాలజీతోపాటు గ్రామీణ డిజిటల్ సబ్ స్టేషన్ స్థాయిని పెంచడంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేశారు. ఈ టెక్నాలజీని త్వరలోనే రాష్ట్రంలో అమలు చేసి ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది.








# ముంపు నివారణకు ప్రణాళిక

### జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముంపు నివారణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొంచిచాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్షాకాలం నేపథ్యంలో ముంపు నివారణకు చేపడుతున్న అభివృద్ధి పనులు, కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో జిల్లాలోని ముంపు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో ఇప్పటికే చేపట్టి పూర్తయిన, ఇంకను కొనసాగుతున్న పనుల పురోగతిపై సమీక్షించిన ఆమె వాటిని త్వరితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ, మండలాల వారీగా రహదారులు, మైనర్ ఇరిగేషన్ పనుల పెండింగ్ వర్క్స్, ముంపు ప్రాంతాల వివరాలు సాయంత్రంలోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, విద్యుత్తు శాఖ, మునిసిపాలిటీ, నీటి పారుదల, విపత్తు నివారణ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పని చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వరదల సమయంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడటమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఇప్పటినుంచే తగు ప్రణాళికలు రూపొందించుకుంటూ ముందుకు సాగాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, పంచాయతీ రాజ్, విద్యుత్తు శాఖ, మునిసిపల్, వైద్య ఆరోగ్య, నీటి పారుదల, విపత్తు నివారణ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు వింటూ.. పరిష్కారమార్గం చూపుతూ..

### గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన దరఖాస్తులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లతోపాటు గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కు దరఖాస్తులు పోటెత్తాయి. వరంగల్ లో స్థానిక కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, హనుమకొండలో కలెక్టర్ పి.ప్రావీణ్య, బల్దియాలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొని ప్రజలనుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వరంగల్ కలెక్టర్ లో మొత్తం 124 దరఖాస్తులు రాగా అందులో అత్యధికంగా జిల్లా రెవెన్యూ శాఖకు సంబంధినవే 84 ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. అదే విధంగా హనుమకొండ కలెక్టరేట్ లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ప్రజల నుంచి 193 వినతులు స్వీకరించారు. వరంగల్ కలెక్టర్ లో జరిగిన కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో కృష్ణ వేణి, జిల్లా పరిషత్ సీఈఓ రాం రెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. హనుమకొండలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, డీఆర్వో వైవీ గణేష్, ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డాక్టర్ ప్రసాద్ శర్మకు.. జ్యోతిష్య భీష్మ బిరుదు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో శ్రీ విద్యా పూర్ణ దీక్షా పరులు, చండీ ఉపాసకులు శ్రీ చండీ పరమేశ్వరి పీఠాధిపతి, ప్రముఖ పంచాంగ కర్త, సిద్ధాంతి డాక్టర్ అవసరాల ప్రసాద్ శర్మ సిద్ధాంతిని ఇంటర్నేషనల్ అస్ట్రో ఎక్సెలెన్స్ అవార్డుతో పాటు జ్యోతిష్య భీష్మ బిరుదులు వరించాయి. న్యూ ఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ కాన్వొకేషన్ లో వేద, మంత్ర, తంత్ర జ్యోతిష్య శాస్త్ర పరంగా గత కొన్ని సంవత్సరాలుగా చేసిన విశేష కృషికి గాను ఈ అవార్డులు ప్రసాద్ శర్మ సొంతమయ్యాయి. నేటి వేగవంతమైన ప్రపంచంలో ఇలాంటి అద్భుతమైన విద్యల్లో నిజమైన పాండిత్యం గల నిష్ణాతులు వేళ్ళ మీద లెక్క పెట్టగలిగిన అతి కొద్ది మందిలో ఈయన ఒకడంటూ కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అతిశరళంగా సామాన్యుడికి కూడా అర్థమయ్యేలా పంచాంగ గణన, 2014,2018,2019,2023,2024లో ఎన్నికల ఫలితాలు, ఇతర దేశాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు, రాష్ట్రపతి ఉపరాష్ట్రపతి ఎన్నికల ఫలితాలను ముందే చెప్పి అందరిని అమితంగా ఆకట్టుకున్నారు. ఎంతోమంది శిష్యుల్ని జ్యోతిషం, మంత్ర శాస్త్ర విద్యల్లో ప్రావీణ్యులుగా తయారు చేశారు. ప్రస్తుతం తెలంగాణ దేవాదాయ, ధర్మాదాయ శాఖ అర్చక ఉద్యోగ జేఏసీ, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ఆస్థాన సిద్ధాంతిగా కొనసాగుతున్నారు. తన ఆధ్వర్యంలో వందల దేవాలయాల్లో విగ్రహాల ప్రాణ ప్రతిష్ట, మరెన్నో ఆయుత, ప్రయుత, సహస్ర, శత చండీ యాగాలు, అలాగే రాజశ్యామాలాది దశ మహావిద్యాది యాగాదులు చేసిన ప్రసాద్ శర్మ తన పీఠం ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా సామాజ సేవ, వేదపాఠశాలలకు, పేదవిద్యార్థులకు సాయంచేయడంద్వారా ఎన్నో సంస్థలు ఆయనకు అనేక బిరుదులు, గౌరవ డాక్టరేట్ లు అందజేసి సత్కరించారు. వివిధ రాష్ట్రాల జ్యోతిష్య పండితులు ఉన్న ఇలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వేదికపై అవార్డు పొందడం ఎంతో ఆనందంగా ఉందంటూ ప్రసాద్ శర్మ అభిప్రాయపడ్డారు.

# కరీమాబాద్ బీరన్న స్వామి దేవస్థాన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షుడిగా కోరే సదానందం

### ప్రధాన కార్యదర్శిగా కోరే నాగరాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని కరీమాబాద్ లో సోమవారం శ్రీ బీరన్న స్వామి దేవస్థాన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కోరే సదానందం, ప్రధాన కార్యదర్శి కోరే నాగరాజు, కోశాధికారిగా నరిగె లక్ష్మణ్, కుల పెద్దలు దయ్యాల పురుషోత్తం, మండల రాజు, ఉపాధ్యక్షులు దయ్యాల కృష్ణ, సహాయ కార్యదర్శి దయ్యాల సుధాకర్, ముఖ్య సలహాదారులు కంకల మల్లేశం, కోరే కుమారస్వామి, బండారి రాజేశ్వర్, మండల కొమురెల్లి, ఆర్గనైజర్స్ నంద నవీన్, గొట్టే సదానందం, కుండే క్రాంతి, కార్యవర్గ సభ్యులు మురికి రాజు, కాటం సతీష్, కంచ తిరుపతి, వాసూరి శ్రీనివాస్, కంకల శంకర్, యెమ్మ వేణు, అన్న శ్రీనివాస్, మురికి చిన్న రవి, బండారి అరవింద్, కొమ్ము రాజు, కాటం సతీష్, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# కొత్త చట్టాలపై కొనసాగుతున్న పోలీస్ శిక్షణ తరగతులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వచ్చే నెల జులై 1 నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించడం కోసం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొత్త చట్టాలపై అవగాహన కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సెంట్రల్ జోన్ పరిధిలోని శాంతి భద్రతల విభాగానికి చెందిన పోలీస్ అధికారులతో పాటు ఇతర వివిధ విభాగాలయిన ట్రాఫిక్, సీసీఎస్. సీసీఆర్బీ, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, సైబర్ క్రైం విభాగాలకు చెందిన పోలీస్ అధికారులకు స్థానిక ఎల్ బీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతులకు పోలీస్ అధికారులు, సిబ్బంది విడతల వారీగా హాజరవుతున్నారు. రాష్ట్ర పోలీస్ శిక్షణ కేంద్రంలో ముందుగా శిక్షణ పొందిన అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతుల్లో పోలీస్ అధికారులకు కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం-2023 చట్టాలపై పూర్తి అవగాహన కలిగించడం జరుగుతోందని తెలిపారు. ఈ నెల 6 నుంచి ప్రాంభమైన ఈ శిక్షణ తరగతుల్లో ఇప్పటి వరకు 740 మంది పోలీస్ అధికారులు శిక్షణ పొందారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 30 ముగుస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ నాగబాబు, శాయంపేట ఎస్ఐ దేవేందర్, మనీషా రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐలు రామారావు, యుగంధర్, ఉమాకాంత్, రవి, పరుశురాంతో పాటు హనుమకొండ, కాజీపేట్ ట్రాఫిక్, హనుమకొండ డివిజినల్ పోలీసులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన మార్త వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మరణించగా తనతో పాటు 1995 సంవత్సరం 10వ తరగతి చదువుకున్న మిత్ర బృందం తరఫున సోమవారం అతని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లం వజ్రం, చెలుమల్ల మాధవరెడ్డి ,గడ్డం సంతోష్, తాటి కంటి రోశాలు, యాలాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజావాణి దరఖాస్తులను అధిక ప్రాధాన్యత కల్పించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలేక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలు రెవిన్యూ శాఖకు సంబంధించినవి (20), ఉద్యోగాలకు సంబంధించినవి (04), 2 బీహెచ్ కే (01), ఇతర శాఖలకు సంబంధించినవి (20), మొత్తం (45) దరఖాస్తులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్ జి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డిలతో కలిసి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరతగతిన వాటికి పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీ దారులకు అందరికీ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఎవరు అధైర్యపడకూడదని తెలిపారు. జిల్లా పరిపాలన గ్రామస్థాయి వరకు చేరడంలో పంచాయతీరాజ్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు సమన్వయంతో విధులను నిర్వర్తించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉండే స్థానిక వనరులను గుర్తించాలని , మహిళలకు యువతకు జీవనోపాధి కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వరదల నేపథ్యంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు రెండు బోట్స్ వచ్చాయని, వాటిని వెంటనే పరీక్షించి ట్రయల్ రన్ నిర్వహించాలని, అగ్నిమాపక శాఖ అధికారులను, మండలాల వారీగా రహదారుల పరిస్థితులపై వాటి స్థితిగతులపై నివేదిక సమర్పించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్ఓ అప్పయ్య, విద్యాశాఖ అధికారి పాణిని, ఎస్సీ ఈడి తుల రవి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, సివిల్ సప్లై మేనేజర్ బి.రాంపతి, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డీసీఓ సర్దార్ సింగ్, మైనార్టీ శాఖ అధికారి ప్రేమలత, ఎల్ డీఎం రాజ్ కుమార్, 9 మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం భూపాలపల్లి సుభాష్ కాలనీలో రూ.27.60 లక్షలతో కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్ (సీఆర్సీ) భవనాన్ని ముఖ్య అతిథిగా హాజరై, కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంతకుముందు పలువురు మహిళలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, పూల బొకె అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని, మహాలక్ష్మి పేరిట ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. త్వరలోనే 55ఏళ్లలోపు మహిళలకు నెలకురూ.2500అందించేలాకసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# నేతన్నల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రవ్యాప్తంగా చేనేత, పవర్ లూమ్ కార్మికులు పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో అనేక సమస్యలతో సతమతమవుతూ ఆత్మహత్యల పాలవుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు నిశితంగా విమర్శించారు. ఇటీవల సిరిసిల్లలో నేత కార్మికుడు కుడికాల నాగరాజు ఆత్మహత్య చేసుకొని బలవన్మరణం చెందాడని, ఈ ఆరు మాసాలలో ఎందరో నేతన్నలు ఆత్మహత్యలపాలైనారని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. నేతన్నలకు చేతినిండా పని కలిగిస్తామని, చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పాలకులు మారితే బ్రతుకులు మారుతాయని ఆశించిన నేతన్నలకు నిరాశే మిగిలిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత, పవర్ లూమ్ పరిశ్రమల పరిరక్షణకై నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. బతుకమ్మ చీరల పాత బకాయిలు వెంటనే చెల్లించాలని, చేనేత మిత్ర, చేనేతకు చేయూత తదితర పథకాలను అమలు జరపాలని, సహకార సంఘాల ఎన్నికలను తక్షణమే నిర్వహించి సహకార వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం తర్వాత రెండవ పెద్ద ఉపాధిరంగమైన చేనేతను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఆత్మహత్యల పాలైన కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. నేతన్నలు మనోధైర్యం కోల్పోవద్దని, ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడవద్దని సంఘటితంగా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** కరీమాబాద్ ఉర్సులోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల 1984-1985 ఎస్సెస్సీ బ్యాచ్ 90 మంది విద్యార్థులు నాని గార్డెన్స్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరిగిందని న్యూ కౌటిల్య (సెయింట్. ఆమెన్) స్కూల్ యాజమాన్యం కోడెం శ్రీధర్ తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్కూల్ ఉపాధ్యాయ బృందాన్ని గౌరవించే మహా అదృష్టం లభించిందని వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు అందరు తమ ఉపాధ్యాయ బృందానికి ఘనంగా సన్మానం చేసినందుకు ఉపాధ్యాయ బృందం ఆనందం వ్యక్త పరిచారు. తమ దీవెనలు, ఆశీస్సులు ఎల్లపుడు వుంటాయని దీవించారు. 40 సంవత్సరాల తర్వాత నేడు పాత మిత్రులను కలుసుకొని, చిన్న పిల్లలుగా మారి తమ బాల్యంలో జరిగిన విషయాలు గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు అందరిని సమీకరించడం ఎంతో మిక్కిలి సంతోషంగా ఉందని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బలభద్ర అశోక్, కోడెం శ్రీధర్, పిన్న రాజు, దేవసాని శ్రీరామ్మూర్తి, గట్టు రమణ సమన్వయ కర్తలుగా వ్యవహరించారని కోడెం శ్రీధర్ తెలిపారు.

# జిల్లాలో జ్వరాలను నియంత్రించండి

## వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య

**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని వైద్యాధికారులకు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కు, పారామెడికల్ సిబ్బందికి డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య సమీక్షించారు. ఇందులో భాగంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఉప కేంద్రాలలో మౌలిక సదుపాయాల లభ్యత, మానవ వనరులపై, ఆరోగ్య సేవలు విస్తృతంగా అందించేందుకు కావలసిన సదుపాయాలపై, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది చే తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. రాబోవు వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ఏ ఒక్కరూ కూడా జిల్లాలో వైద్య సేవలు అందకుండా మృతి చెందారని వార్తలు రాకుండా ప్రజలకు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, హెడ్ క్వార్టర్స్ విడిచిపెట్టి వెళ్లకూడదని తెలిపారు. వరద ముంపు ప్రాంతాలలో క్లిష్టతరమైన గ్రామాలలోని గర్భిణీ స్త్రీలను దగ్గరలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ కు తరలించాలని కోరారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ వైద్యాధికారులు తమ, తమ గ్రామాలను తరచుగా ఇండ్లను



సందర్శించాలని, జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు, మలేరియా రోగ నిర్ధారణ పరీక్షలు జరపాలని, మలేరియా అని నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స ప్రారంభించాలని, చికిత్స అనంతరం కూడా వారిని వారి కుటుంబ సభ్యులను సందర్శించాలని, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవాలని, అప్పుడే జ్వరాలను మనం నియంత్రించగలమని తెలిపారు. వైద్యాధికారులు ప్రజల ఆరోగ్యపరమైన ఇబ్బందులను తెలుసుకొని, వాటికి నిర్ధారణ పరీక్షలు జరిపించి చికిత్సలు అందజేయాలని, గ్రామాలలోని నాయకులతో సహకారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పవన్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రణధీర్, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యాధికారులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కార్యాలయ సిబ్బంది, డెమో తిరుపతయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

### ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, నీట్ పరీక్ష మళ్లీ తిరిగి తక్షణమే నిర్వహించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్ డీఎస్) రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి డిమాండ్ చేశారు. ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఫ్ డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై బహిర్గతం కావద్దని దురుద్దేశంతో హుటాహుటిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదల రోజున నీట్ పరీక్ష ఫలితాలను ఆగమేఘాల మీద విడుదల చేసి విద్యార్థుల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేశారని మాస్ సావిత్రి ఆరోపించారు. ఎన్ టీఏ వైఫల్యం వల్ల లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో నెట్టి వేయబడిందని ఆమె అన్నారు. ఈ ఉదంతంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, తిరిగి మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆమె కేంద్ర ప్రభుత్వానికి కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు పిలుపునిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ డీఎస్ జిల్లా నాయకులు పొలబోయిన రాజు, పిట్టల సాయి, బన్నీ, సృజిత్ పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి దేవాలయం నూతన అధ్యక్షుడిగా నంద రమేష్



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని కీర్తి నగర్ అభయాంజనేయ స్వామి దేవాలయం నూతన అధ్యక్షుడిగా నంద రమేష్ ఎన్నికయ్యారు. పరకాల నియోజకవర్గం 16వ డివిజన్ కీర్తి నగర్ లో అభయాంజనేయ స్వామి దేవాలయం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించగా కాలనీ పెద్దల సమక్షంలో నూతన అధ్యక్షుడిగా నంద రమేష్ ను ఎన్నుకున్నారు. అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి తోడ్పడుతానని అధ్యక్షుడు రమేష్ తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రమేష్‌ను పలువురు సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉప్పరోని కుంటలో నిలిచిపోయిన డ్రైనేజీ పనులు పూర్తి కావడానికి టౌన్ ప్లానింగ్ ద్వారా మార్కింగ్ ఏర్పాటు చేయిస్తానని మహానగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హామీ ఇచ్చారు. సోమవారం గ్రీవెన్స్ సెల్ లో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో దీనిపై వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా కమిషనర్ పై విధంగా స్పందించారు. ఉప్పరోనికుంట వద్ద రూ. 1.20 కోట్ల నిధులతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పనులు కాంట్రాక్టర్ చేపడితే సరైన మార్కింగ్ లేక మధ్యలోనే నిర్మాణం పనులు వదిలేశాడని, కాంట్రాక్టర్లు పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కుడా అధికారుల దృష్టికి మార్కింగ్ ఇవ్వమని ఎన్నోసార్లు విన్నవించినప్పటికీ పెడచెవున పెడుతున్నారని చెప్పారు. వర్షం నీరు, రంగ శాయిపేట నుంచి వచ్చు మురుగునీరు అంతా కాలువ సరిగా లేనందున ఉర్సు హిందూ శ్మశాన స్మశాన వాటికలోనికి డ్రైనేజీ పక్కనున్న ఇండ్లలోకి నీరు పోయి నిలిచి ఉంటుందన్నారు. శ్మశాన వాటికలో పూర్తిగా నీరు నిలిచి ఉండడం వల్ల దహన సంస్కారాలు చేయలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంకీ ఫుడ్ కోర్ట్ ప్రాంతంలో వెలసిన నూతన గృహాలకు రాత్రి వేళలో ప్రజలు తమ ఇండ్లకు వెళ్లాలంటే పాములతో భయపడుతున్నారని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ ను వినతిపత్రంలో కోరారు. కార్పొరేటర్ వెంట కాలనీవాసులు సుంచ పాపయ్య, కే వీరమల్లయ్య, మాసోడి మల్లయ్య, శ్రీపాద హరిప్రసాద్, నాగపూరి అశోక్, పోతు రామిరెడ్డి, గణేష్, షబ్బీర్, బత్తిని లక్ష్మీపతి, గొడిశాల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

## కేయూ న్యాయ శాస్త్ర విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా పద్మజా రాణి



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ న్యాయ శాస్త్ర విభాగ పాఠ్య ప్రణాళిక నూతన అధ్యక్షురాలిగా విభాగ సహ ఆచార్యులు డాక్టర్ వై. పద్మజ రాణిని నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ పద్మజ రాణి ప్రస్తుత పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడు ఆచార్య ఎం.శ్రీనివాస్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ పద్మజ రాణి విశ్వవిద్యాలయంలో 2007 సంవత్సరంలో ప్రవేశించారు. విశ్వవిద్యాలయ హాస్టల్ ల జాయింట్ డైరెక్టర్ గా, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ గా, విభాగాధిపతిగా, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా పని చేశారు. డాక్టర్ పద్మజ రాణి 30కి పైగా పరిశోధన పత్రాలను జాతీయ, 5 పరిశోధన అంతర్జాతీయ సదస్సులలో సబ్మిట్ చేశారు. ఆరుగురు విద్యార్థులు ఆమె పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి తమ డాక్టరేట్ పట్టా పొందారు. కెనడా దేశాన్ని సందర్శించారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ పద్మజ రాణిని అభినందించారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



**వరంగల్ వాయిస్, నడికూడ :** రైతులను ఆదుకునేది, గౌరవించేది ఒక కాంగ్రెస్ పార్టీనేనని కాంగ్రెస్ పార్టీ నడికూడ మండల ప్రధాన కార్యదర్శి కుడ్ల మలహాల్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీని క్యాబినెట్ మీటింగ్ లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల సమక్షంలో ఆమోదించడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ మాట ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టు కుందని, రైతులను ఆదుకొని వారి మొహంలో సంతోషాన్ని చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినమాట ప్రకారం ఆరు గ్యారెంటీలను ఒకదాని తర్వాత ఒకటి నెరవేరుస్తుందని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరకాల శాసన సభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డిల చిత్ర పటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేసి, నినాదాలు చేశారు. అనంతరం టపాకాయలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నడికూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్ల నవీన్, మండల యూత్ అధ్యక్షుడు అప్పం కుమారస్వామి, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి రాములు, పరకాల బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శనిగరం సాంబయ్య, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి దుప్పటి సదానందం, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి జీల శ్రీనివాస్, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి యుగంధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాడి ప్రతాప్ రెడ్డి, కోడెపాక కరుణాకర్, వాంకె రాజయ్య, బొల్లె భిక్షపతి, దేవు రమేష్, ఏండిగ రాజేశ్వరరావు, రావుల సురేష్, అట్టెం బాబు, మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కోడెపాక ప్రశాంత్, మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అడ్వాన్స్ ఫలితాలలో అగ్రగామి ధర్మసాగర్ కళాశాల



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** నేడు ప్రకటించిన ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో ఉత్తీర్ణతలో జిల్లాలో ధర్మసాగర్ కళాశాల మొదటి స్థానంలో నిలిచింది. 138 విద్యార్థులకు గాను 127 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 93శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో అగ్రస్థానంలో నిలిచింది. వార్షిక ఫలితాలలోనే రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్క్ లు 466 ఎంపీసీ, 437 బైపీసీలో మార్కులు సాధించిన విద్యార్థులు ఈ అడ్వాన్స్ పరీక్షలలో మరిన్ని ఉత్తమ ర్యాంకులను సాధించారు. బైపీసీ విభాగంలో ఆలమూరు సౌమ్య 434, అంజన్ కుమార్ 424 మార్క్స్ సాధించారు. ఎంపీసీ విభాగంలో 457 శ్రీధర్, నితిన్ 453, శైలేష్ విట్టల్ 450 , శశివదన్ రెడ్డి 429, మైత్రేష్ కుమార్ 426, ఐశ్వర్య 419, హెచ్ఈసీ విభాగంలో 444 సీఈసీ విభాగంలో 427 వేములకొండ అభిలాష్ మార్కులు పొందారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం అభినందించారు. నాణ్యమైన భోధన ,అదనపు పని దినాలతో ఈ ఫలితాలను సాధించామని ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ తెలిపారు. ప్రథమ ద్వితీయ సంవత్సరాలలో అడ్మిషన్ లు జరుగుతున్నాయని, విద్యార్థులను పెద్దఎత్తున నమోదు చేయించాలని కోరారు. ప్రభుత్వం అందించే ఉచిత నాణ్యమైన విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## బాధిత కటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టి కొప్పుల రాంబాబు అమ్మ గట్టి కొప్పుల ఎల్లమ్మ సోమవారం ప్రమాదవశాత్తు మరణించారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గం బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎల్లమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## జీతాల పెంపు జాప్యంపై సమ్మె కొనసాగుతున్న ఆసుపత్రి కార్మికుల నిరసన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత ఏడు సంవత్సరాలుగా నయా పైసా జీతం కూడా పెరగలేదని చాలీచాలని జీతాల ఆకలికేకలతో నాగర్ కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ కార్మికులు ఆగ్రహించి సోమవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నేతృత్వంలో ఉదయం ఏడు గంటల నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో ఆందోళన చేపడుతున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులతో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రఘు చర్చలు జరిపారు. అయినప్పటికీ మా బతుకులు చూడండి సార్ అంటూ వేడుకుంటూ సమ్మె విరమించేది లేదని భీష్మించి సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2023 జూన్ నెల నుంచి ఆస్పత్రి కార్మికులకు రూ.15600 వేతనాలు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని, ఈ వేతనాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డీఎంఈ, టీవీవీపీ పరిధిలోని అన్ని ఆసుపత్రిలో అమలవుతూ రెండు సంవత్సరాలు గడుస్తున్న నాగర్ కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మాత్రం టెండర్ల ఎంపికలో గందరగోళం నెలకొంది. ఆసుపత్రిలో ఉన్న ప్రస్తుత ఎస్ఎస్సీ ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మిక చట్టాలకు ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా ఆసుపత్రి కార్మికులకు కేవలం రూ. 7600 వేతనం చెల్లిస్తూ భారీ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై ఎస్ఎస్సీ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు ఫిర్యాదులు చేసిన చర్యలు శూన్యమన్నారు. ఇలాంటి అవినీతి అక్రమాల ఎస్ఎస్సి ఏజెన్సీ నిర్వాహకులే కోర్టులో రిట్ పిటిషన్ వేసి టెండర్లు పూర్తి కాకుండా కాలయాపన చేస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కాబట్టి, జిల్లా కలెక్టర్ గారు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్వర్ రెడ్డి, డీఎంఈ ప్రత్యేక చొరవ చూపించి కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, ఏఐటీయూసీ నాయకులు తుమ్మల శివుడు సురేష్, ఆసుపత్రి కార్మికులు మణెమ్మ, గౌరమ్మ, బాలకిష్టమ్మ, నాగమణి, సంతోషమ్మ, రేణుక, మహేశ్వరి, అజ్మీర, రంజాన్ బి, మన్నెమ్మ, అలివేలమ్మ, రాధా, బూరన్ బీ, శిరిష, జ్యోతి, మనెమ్మ, ఆలీ, రాజ్ గౌడ్, యాదగిరి, ఖలీల్, నిరంజన్, వెంకటేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజుల వసులు నియంత్రించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ పట్టణ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలు, పేద విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడాన్ని నియంత్రించాలని కాంగ్రెస్ నాయకులు దాసరి నాని యాదవ్, జక్కుల సురేష్ యాదవ్, సందీప్, మహేష్, ఇర్ఫాన్ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. డోర్నకల్ పట్టణంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు పేద విద్యార్ధుల నుంచి అధిక స్కూల్ ఫీజు, పుస్తకాల ఫీజు, ట్రాన్స్పోటేషన్ ఫీజు అంటూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఫీజులు చెల్లించటం విద్యార్దులు తల్లితండ్రులకు భారంగా మారి ఆర్దిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్య హక్కు చట్టం 2009 ప్రకారం 25 శాతం పేద విద్యార్దులకు ఉచితంగా సీటు కేటాయింపు నిబంధనలు పాటించడం లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాలను తిరస్కరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై విచారణ జరిపి స్కూల్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం షిరిడి సాయి ట్రస్ట్ వరంగల్ ఆధ్వర్యంలో ఆర్ఓ ప్లాంట్ ను (నీటి శుద్ధి పరికరం) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షిరిడి సాయి ట్రస్ట్ వారు మాట్లాడుతూ వాటర్ ద్వారా మన లోపల చాలా రకమైనటువంటి వ్యాధులు వస్తున్నాయని, మరి అలాంటి వ్యాధులను అరికట్టడం కోసం ఈ పాఠశాలలో ఆరో ప్లాంట్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య రీత్యా, ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి శుద్ధి పరికరాలను ఏర్పాటు చేస్తున్న షిరిడి సాయి ట్రస్ట్ వరంగల్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి ట్రస్ట్ లలిత, శ్రీలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్, విద్యా వాలంటరీ పర్శవేణి జ్యోతి, ఐఆర్పీ రమేష్, అంగన్వాడీ టీచర్ నందిపాటి సంధ్య, అంగన్వాడీ ఆయాలు అరుణ, సరోజన సుశీల, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశంలో మాఫియా చేతిలో విద్యారంగం

### ధరలపై 26న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వ పాలనలో విద్యారంగం పూర్తిగా మాఫియా చేతుల్లోకి వెళ్లిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. సోమవారం వరంగల్ శివనగర్ లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సమావేశం ఎండీ అక్బర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆందోళనలో పడిపోయారన్నారు. నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేసి రాష్ట్రాల పరిధిలోకి తేవాలని అన్నారు. విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతున్నదని అన్నారు. దేశ వ్యాప్తంగా నీట్, నెట్ పరీక్ష పేపర్ లు లీకైనా ప్రధాని నోరు మెదపడం లేదని అన్నారు. మరోవైపు నిత్యావసరాలు సహా పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యులకు మోయలేని భారంగా మారాయన్నారు. నేడు కూరగాయల ధరలు కూడా రెక్కలు వచ్చాయని, ధరలు ఆకాశన్నంటినా నియంత్రణకై చర్యలు తీసుకోవడం లేదన్నారు. గడిచిన వారం, పది రోజులలోనే ధరలు అమాంతం పెరిగినా పాలకులు చోద్యం చూస్తున్నారన్నారు. పేదలు, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో లేకుండా ధరలు పెరిగినా కేంద్ర ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. పెరిగిన ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని మండల కేంద్రాలలో ఈ ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్ మియా, జిల్లా నాయకులు బుస్సా రవీందర్, అక్కపెల్లి రమేష్, గన్నారపు రమేష్, సంగి ఎలేందర్, గుండె బద్రి, తోట చంద్రకళ, వీరగోని శంకరయ్య, చెన్నకేశవులు, ల్యాదెల్ల శరత్, జన్ను రవి, రమేష్, సంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి

### వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అవినీతి రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని ప్రైవేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత గంజాయి, తదితర మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత సమాజంపై ఎంతైనా ఉందన్నారు. సమాజంలో మార్పులు జరగాలంటే నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ కార్యకలాపాలను ముమ్మరం చేయాల్సిన బాధ్యత కమిటీపై ఉందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులు, హింసను అరికట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూర విద్యాసాగర్ గౌడ్, వైసర్లు విజయలక్ష్మి, విజయ్ చందర్, నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ జాతీయ కార్యదర్శి సయ్యద్ షబ్బీర్ అలీ, రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబలి, ఉపాధ్యక్షులు షేక్ బాబా ఖాదర్ అలీ, రాష్ట్ర కార్యదర్శి పోలేపాక మధు, రాష్ట్ర ఇంచార్జి షేక్ ఆదామ్ అలీ, సెక్రెటరీ ప్రవీణ్, రాష్ట్ర జిల్లా నాయకులు నగేష్, ఠాగూర్ దినేష్ ,కొరివి అనిల్ కుమార్, నాగబెల్లి విద్యాసాగర్, షేక్ ఉస్మాన్ భాష, మహిళా అధ్యక్షురాలు పోలెపాక రాణి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## కదం తొక్కిన అంగన్వాడీలు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘం అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం విజయవంతమైంది. కోర్టు ముందు నుంచి కలెక్టర్ కార్యాలయంవరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ అంగన్వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు బానోతు లలితలు మాట్లాడుతూ ఐసీడీఎస్ లో 1975 నుంచి అంగన్వాడీలు గౌరవ వేతనం పేరుతో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ చేస్తున్నారని, చాలీ చాలని తక్కువ వేతనం పొందుతూ కుటుంబ పోషణ భారంగా జీవితాలని వెళ్లదీస్తున్నారు. వీరికి కనీస వేతనం రూ.26,000, హెల్పర్లకు రూ.21,000 ఇవ్వాలని అనేక ఏళ్లుగా పోరాటం చేస్తున్న, గత ప్రభుత్వ హయాంలో 24 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా చేసిన సమ్మెలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు రూ. 18,000/-, హెల్పర్లకు 15,000/- ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ అది నేరవెర్చలేదన్నారు. నేటి ప్రభుత్వం కూడా అధికారంలోకి రాగానే వేతనం పెంచుతామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన అంగన్వాడీలను పట్టించుకోదని మండిపడ్డారు. అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు, టాయిలెట్స్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించి, ఖాళీగా ఉన్నటీచర్, ఆయా పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశల వారీగా ఉద్యమాలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్రా శ్రావణ్, పద్మ, శారద, బీరమ్మ జయమ్మ స్వప్న, గీతా రాణి, రాజమ్మ, రమాదేవి, వరిపల్లి వెంకన్న, వెలుగు శ్రావణ్, మంద శంకర్, పెరుగు కుమార్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని స్థానిక శ్మశాన వాటి హరిహర ముక్తిధామంలో సోమవారం పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి హనుమండ్ల ఝాన్సీ రెడ్డిలు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు లయన్స్ క్లబ్ వారు చేపడుతున్న పలు కార్యక్రమాలు చాలా బాగున్నాయంటూ కేంద్రంలోని స్థానిక శ్మశాన వాటిక అభివృద్ధికి వారు చేసిన కృషి అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో కూడా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రభుత్వం నుంచి తన సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తానని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, కౌన్సిలర్లు నరుకుటి గజానంద్, దొంగరి రేవతి, కర్నేనాగజ్యోతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మున్సిపల్ ఏఈ రంజిత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ముగ్గురూ.. ముగ్గురే

### టీయూడబ్ల్యూజే(ఐజేయూ)లో మనోళ్లు

### రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాడిపెల్లి మధు, కార్యవర్గ సభ్యులుగా వేణు మాధవ్, కంకణాల సంతోష్

### సన్మానించిన పలువురు జిల్లా నేతలు


**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తెలంగాణ రాష్ట్ర కమిటీలో మనోళ్లకు పెద్దపీట దక్కింది. పాత్రికేయ రంగంలో ఎంతో అనుంభవం ఉన్న ముగ్గురు సీనియర్ జర్నలిస్టులకు కమిటీలో చోటు దక్కడంపై జిల్లా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంఘం రాష్ట్ర 3వ మహాసభలు ఇటీవల ఖమ్మంలో నిర్వహించారు. ఈ మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాడిపెల్లి మధు, ఈసీ మెంబర్లుగా పెండెం వేణుమాధవ్, కంకణాల సంతోష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా వీరిని సియాసత్ పత్రిక సీనియర్ పాత్రికేయులు ఇస్మాయిల్ జబి ఆధ్వర్యంలో ఉర్సు దర్గా మాషుకే రబ్బాని పీఠాధిపతి ఉబేద్ బాబా ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్ర కమిటీలో ఎన్నికయిన వారిని సన్మానించారు. వీరిని పూలమాలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్యను ఉబేద్ బాబా తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. అనంతరం ఉబేద్ బాబాను రాష్ట్ర కమిటీ, ప్రెస్ క్లబ్ బాద్యులు, యూనియన్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నేషనల్ కౌన్సిల్ మెంబర్ సంగోజు రవి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, వరంగల్ ప్రెస్ క్లబ్ ఈసీ మెంబర్ నయీమ్, పెరుమాండ్ల మధు, సాజిద్, ఎండీ.అమీర్, హుస్సేన్ పాషా, అమీర్, అక్రం, కలికోట శ్రీధర్, నయీం తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ వాయిస్ శుభాకాంక్షలు..

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తెలంగాణ రాష్ట్ర కమిటీలో వివిధ పదవులు దక్కించుకున్న గాడిపెల్లి మధు, పెండెం వేణుమాధవ్, కంకణాల సంతోష్ కు వరంగల్ వాయిస్ దినపత్రిక శుభాకాంక్షలు తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, జర్నలిస్టులు సామల సూర్యప్రకాశ్, వెన్ను రాము, గోలి రవి, సిద్దోజు రాకేశ్, పూజరి విజయ్, పలువురు జర్నలిస్టు నాయకులు, జర్నలిస్టులు, లయన్ క్లబ్ సభ్యులు, మిత్రులు, స్నేహితులు, అధికారులు ఆకాంక్షించారు.










## సవ్యసాచి గాడిపెల్లి మధు..



పాత్రికేయ రంగంలో ఆయన పేరు తెలియని వ్యక్తి లేడు. సీనియర్ జర్నలిస్టులతోపాటు నిన్న మొన్న పత్రికా రంగంలోకి అడుగు పెట్టిన వారాకి కూడా ఆయన సుపరిచితుడే. నొప్పించక, తానొప్పక అందరితో కలివిడిగా ఉండే ఆయనే గాడిపెల్లి మధు. గాడిపెల్లి నారాయణ, దేవకమ్మలకు ఆరుగురు సంతానం. వీరిలో ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. అయితే ఐదుగురు కుమారులు జర్నలిస్టులు కావడం గమనార్హం. అందులోనుంచి పుట్టిన ఆణిముత్యమే గాడిపెల్లి మధు. 1993లో జర్నలిస్టు రంగంలోకి అడుగు పెట్టిన ఆయన వివిధ దిన పత్రికలు, చానళ్లలో ప్రత్యేక భూమికను పోషించారు. అందరితో కలిసిపోయే మనస్తత్వం కావడంతో వివిధ పదవులు కూడా ఆయనను వరించాయి. ఎంత ఎదిగినా ఒదిగి పోవాలన్న ఆలోచనే తనను అందరిలో ఒకడిగా మర్చిందంటున్నారు గాడిపెల్లి మధు. విద్యార్థిదశలోనే ఎన్ఎస్ యూఐ మరిపెడ మండలం అధ్యక్షుడిగా, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1998లో చిన్న పత్రిక జిల్లా నాయకుడిగా, 2006 నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, అక్రిడిటేషన్ మెంబర్ గా, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శిగా విశిష్ఠ సేవలను అందించారు. వర్తమానంతో జర్నలిస్టు జీవితాన్ని ప్రారంభించిన ఆయన 1993నుంచి 1997 వరకు అందులో పనిచేశారు. 1997-98 మహానగరం, 1998-2022 ఉషోదయమ్, 2022-2024 వరకు న్యూస్ భూమ్, వీసా టీవీ, రాజ్ న్యూస్, సూపర్ టీవీ, ఏటీవి, నెంబర్ 1 న్యూస్, ప్రజావాణి, వీ5 న్యూస్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ పనిచేశారు. జర్నలిస్టుగానే కాకుండా వివిధ సేవాసంస్థల్లో క్రియాశీలక బాధ్యతలను పోషించారు. కాగా తనకు జర్నలిజంలో ప్రత్యేక గుర్తింపు రావడానికి అండదండగా నిలిచిన గురువు సీహెచ్.సుధాకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన సేవను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, కనుగంటి శేఖర్, విరాట్ అలీ, రామనారాయణతో పాటు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర కమిటీలో 'వేణు'గానం



ఒకవైపు సమస్యలపై జర్నలిస్టుగా పోరాడుతూనే, తన విద్యాసంస్థ నుంచి సమాజానికి ఉత్తమ పౌరులను అందించే గురుతర బాధ్యతను పెండెం వేణు మాధవ్ భుజానికి ఎత్తుకున్నాడు. అదేవిధంగా లయన్ క్లబ్ లో కీలక పదవులు చేపట్టి అనేక సేవా కార్యక్రమాలతో అవసరార్థులకు సాయం అందిస్తున్నారు. జర్నలిస్టు సమస్యలు సైతం పరిష్కరించేందుకు తాను చేసిన అలుపెరగని పోరాటానికి గుర్తింపుగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ)లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యాడు. అయిటే ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం వేణుమాధవ్ సొంతం. కొద్ది రోజుల క్రితం ఖమ్మం మహాసభల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వేణు మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెండెం వేణు మాధవ్ 2011-12లో రాష్ట్ర కార్యవర్గాల సభ్యుడిగా పనిచేసి అనేక సమస్యలు వెలుగులోకి తెచ్చారు. ఇటీవలే ప్రముఖ డిజిటల్ మీడియా సుమన్ టీవీ ఫ్రాంచెస్ డైరెక్టర్ గా కొనసాగుతూ విజయవంతంగా రిపోర్టింగ్ నిర్వహిస్తున్నారు. అటు జర్నలిస్టుగా సంఘం నాయకుడిగా, వివిధ స్వచ్ఛంద సంస్థల్లో సభ్యుడిగా, విద్యారంగంలో తనకంటూ ప్రత్యేకత కలిగి బహుముఖుడిగా పెండెం వేణు మాధవ్ రాణిస్తున్నారు. ఇంటర్ పూర్తికాగానే 1991లో 'ఉదయం' పత్రికలో విలేకరిగా చేరారు. దానిని మూసివేయడంతో 1995లో అప్పుడే ప్రారంభమవుతున్న 'వార్త'లో చేరి ఆరున్నర సంవత్సరాలు విలేకరిగా కొనసాగారు. నటుడు, నృత్యకారుడిగా బహుమతులను అందుకోవడంతో పాటు వ్యాఖ్యాతగా పేరు పొందారు. 1998లో లయన్స్ క్లబ్ 1000 ఫిల్లర్స్ చార్టర్ సభ్యుడిగా చేరి క్లబ్ స్థాయిలో వివిధ పదవులు, అనంతరం జోన్ చైర్మన్ గా ప్రస్తుతం రీజియన్ చైర్మన్ గా ఉన్నారు.

## ఉద్యమ పొత్తిళ్లలో ఎదిగిన సంతోష్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మారుమూల గ్రామం కొత్తపెల్లి (ఎస్ఎం) లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు కంకణాల చంద్రయ్య-లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు సంతోష్. పరకాల ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ మిషన్ హైస్కూలులో 10వ తరగతి వరకు చదువుకున్నాడు. అయితే 8వ తరగతిలోనే ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషించడంతోపాటు విద్యార్థుల సమస్యలపై గళమెత్తారు. అప్పుడే ఆయన అడుగులు పోరాటాలవైపు మళ్లాయి. గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలోనే ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో పని చేశారు. ద్వితీయ సంవత్సరం చదువును హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ చేయించుకుని చదువును కొనసాగించాడు. అదే క్రమంలో ప్రగతిశీల ఉద్యమ భావాలను వదలకుండా పీడీఎస్‌యూ విద్యార్థి ఉద్యమంలో పాలు పంచుకొన్నారు. డిగ్రీ చదువు మధ్యలోనే వదిలేసి పూర్తికాలం పీడీఎస్ యూ బాధ్యతలు చేపట్టారు. వరంగల్ జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేశారు. నిర్బంధం కారణంగా సీపీఐఎంఎల్ జనశక్తి పార్టీ పిలుపు మేరకు దళంలో చేరి సత్తెన్న పేరుతో దళ కమాండర్‌గా దాదాపు 10 సంవత్సరాల పాటు ఖమ్మం, వరంగల్ జిల్లాలో అనేక పోరాటాలకు పునాదులు వేశాడు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పోడు వ్యవసాయం కోసం ఫారెస్టు అధికారుల వేధింపుల నుంచి విముక్తి కల్పించి వేల ఎకరాల పోడు భూముల పంపిణీ, కూలీ రేట్ల పెంపుదల, తునికాకు కూలీ రేట్ల పెంపు, రైతన్నకు అండగా గిట్టుబాటు ధరల కోసం రైతు ఉద్యమాలను చేశారు. దళకమాండర్ గా పనిచేస్తున్న విజయక్కను వివాహం చేసుకున్నారు. కొంత కాలానికి అనారోగ్య సమస్యలు రావడంతో 1997 పోలీసుల ఎదుట భార్య భర్తలు ఇద్దరూ లొంగిపోయి జనజీవన స్రవంతిలో అడుగు పెట్టారు. గన్ను వదిలిన కొద్ది రోజులకు అదే చేతితో పెన్ను పట్టి పత్రిక రంగం వెట్కపు అడుగులు వేశారు. నేటి ప్రజల అభినందన వార పత్రిక వరంగల్ ఎక్స్ ప్రెస్ సాయంకాల పత్రికలో విలేకరిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఆంధ్రప్రభ, విశాలాంధ్ర, మన తెలంగాణ, ప్రజాపక్షం, ప్రస్తుతం సాక్షిలో పనిచేస్తున్నాడు. ఆ తర్వాత విశాలాంధ్ర పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న సమయంలో ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యులుగా స్థానం దక్కించుకున్నాడు. అదేవిధముగా జర్నలిస్టుల సంక్షేమం కోసం హనుమకొండ జర్నలిస్టుల పరపతి సంఘం ఏర్పాటులో కీలక పాత్ర పోషించి కోశాధికారిగా కొనసాగుతున్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com